





ధనలక్ష్మీ నమోస్తుతే

దసరా మహోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు అయిన శుక్రవారం బోయ కొండ గంగమ్మ ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కరెన్సీ నోట్లతో ధనలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయదారులు, ఈఓ ఏకాంబరం పాల్గొన్నారు.

– చౌడేపల్లె

సింహాసన యోగం..

ముత్యాల మురిపెం



ఇల వైకుంఠంగా అలరారుతున్న తిరుమల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వరస్వామి శుక్రవారం ఉదయం సింహ వాహనంపై యోగ నృసింహుడి రూపంలో దర్శనమిచ్చారు. రాత్రి శ్రీ మలయప్పస్వామివారు శ్రీదేవి, భూదేవితో కలిసి కాళీయ మర్దనుడి అలంకారంలో ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు కటాక్షించారు. శ్రీకృష్ణుడు ముక్కుపై, మెడలో ముత్యాల ఆభరణాలు ధరించినట్టు పురాణాల్లో ఉంది. ఆదిశేషుని పడగలను ముత్యాల గొడుగా పూనిన స్వామివారిని దర్శించినా, స్తోత్రం చేసినా సకల శుభాలు కలుగుతాయని పురాణ ప్రశస్తి. చల్లని ముత్యాలకింద నిలిచిన శ్రీనివాసుని దర్శనం తాపత్రయాలను పోగొట్టి, భక్తుల జీవితాలకు చల్లదనాన్ని సమకూర్చుతుంది. – తిరుమల



న్యూస్‌రీల్

పీఈఎస్ విద్యాసంస్థలపై ఐటీ దాడులు



కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల

కుప్పం: ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని పీఈఎస్ యూనివర్సిటీ విద్యాసంస్థలపై ఐటీ శాఖ అధికాలు దాడులు నిర్వహించారు. కుప్పం పట్టణ సమీపంలోని పీఈఎస్ వైద్య కళాశాలలో మూడు రోజులుగా తమిళనాడు రాష్ట్రం, చెన్నైకి చెందిన 12 మందితో కూడిన ఆదాయ పన్నుశాఖ అధికార బృదం ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. శుక్రవారం పీఈఎస్ మెడికల్ కళాశాల మెయిన్ గేట్‌ను మూసివేసి, ఎంట్రాన్స్ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి ఎవ్వరినీ లోనికి అనుమతించలేదు. కళాశాలలో పనిచేసే సిబ్బంది సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని లోనికి అనుమతించారు. ఇప్పటికే బెంగళూరులోని పీఈఎస్ యూనివర్సిటీలో ఐటీ దాడులు జరిగిన విషయం విధితమే.

పంటలపై ఏనుగుల దాడి



బాలిరెడ్డిగారిపల్లె వద్ద విరిచేసిన ఇనుప గేటు

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ఏనుగులు స్వైర విహారం చేస్తున్నాయి. నిత్యం ఏదో ఒక చోట పంటలను ధ్వంసం చేస్తూనే ఉన్నాయి. శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని పాళెం, దేవళంపేట పంచాయతీల్లో పంట పొలాలను నాశనం చేశాయి. దాదాపు పది మంది రైతులకు సంబంధించిన పంటలను తొక్కిపడేశాయి. పాళెం పంచాయతీతోపాటు దేవళంపేట పంచాయతీలోని దిగవమూర్తివారి పల్లె, మర్రికుంటవారిపల్లె, బాలిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో మామిడి చెట్ల కొమ్మలను విరిచేశాయి. మామిడి తోపునకు అమర్చిన ఇనుప గేటును గొడతో సహా పెకళించివేశాయి. తిరిగి సమీపంలోని చింతల వంకకు చేరు కున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏనుగుల బారి నుంచి పంటలను రక్షించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అధికార బలంతో కూటమి నేతలు కన్నుమిన్ను కానకుండా ప్రవర్తిస్తున్నారు. ఎంతో చరిత్ర కలిగిన చిత్తూరు జిల్లా కేంద్రంలోని కట్టమంచి చెరువుపై కన్నేశారు. పూడికతత తీత పేరుతో మట్టి అక్రమ రవాణాకు ఒడిగట్టారు. పొద్దున్నుంచి చీకటి పడేవరకు యంత్రాల సహాయంతో తవ్వేయడం.. ఆపై ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకోవడం అలవాటుగా చేసుకున్నారు. దాదాపు ఎనిమిది నెలలుగా ఈ తంతు సాగుతున్నా ఏ ఒక్క అధికారీ వారికి అడ్డుచెప్పలేక పోయారు. ఎట్టకేలకు గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు నమోదు కావడంతో తోకముడిచారు. శుక్రవారం మట్టి తవ్వకాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు.



మట్టి ఎత్తివేయడంతో గుంతల మయమైన కట్టమంచి చెరువు

కన్నుమన్ను కానకుండా..!

- కట్టమంచి చెరువులో మట్టి తవ్వి అమ్ముకున్న టీడీపీ నేతలు
- ఆధారాలతో సహా గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు
- కేసు నమోదు కావడంతో టీడీపీ నేతలకు ముచ్చెమటలు
- ఏపీ చీఫ్ సెక్రటరీ, కలెక్టర్‌తో సహా ప్రతివాదులుగా మరో నలుగురు అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : చిత్తూరు జిల్లా కేంద్రంలోని కట్టమంచి చెరువును కూటమి నేతలు చెరబట్టారు. అధికారంలోకి రాగానే ఆ పార్టీ నాయకులు అక్రమ తవ్వకాలకు పాల్పడ్డారు. పూడికతీత పేరుతో మట్టి అక్రమ రవాణాకు పూనుకున్నారు. గత ఎనిమిది నెలలుగా ఉదయం నుంచి రాత్రి వరకు యంత్రాలు పెట్టి అందినకాడికి అడ్డంగా తవ్వేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోతు లోడేశారు. ఈ అక్రమ తవ్వకాల్లో స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధి పాత్ర కీలకంగా ఉందనే ఆరోపణలు మిన్నంటాయి. ఎనిమిది నెలల క్రితం నుంచి తవ్వుతున్నా ఏ ఒక్కరూ కన్నెత్తి చూడ లేదు. ప్రొక్లెయిన్లతో మట్టి తవ్వి వందల ట్రాక్టర్లతో రవాణా చేస్తున్నా అడ్డు చెప్పలేదు. దీనిపై ఇదివరకే సాక్షి దినపత్రికలో ఈ ఏడాది మే 03, మే 12, జూలై 19 తేదీలలో పతాక స్థాయిలో వార్తలు వెలువడ్డాయి. అయినా ఏ ఒక్కరూ స్పందించలేదు.



గతంలో సాక్షిలో ప్రచురితమైన ప్రత్యేక కథనం

ఆగిన పనులు

గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు నమోదు కావడంతో టీడీపీ నేతలకు ముచ్చెమటలు పట్టడం మొదలయ్యాయి. ఈ అక్రమ తవ్వకాలపై అనేక ఆరోపణలు నమోదైనప్పటికీ అధికారిక యంత్రాంగం పట్టించుకోలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంతో చరిత్ర కలిగిన కట్టమంచి చెరువు రూపురేఖలు మారిపోయినా కన్నెత్తి చూడలేదు. ఇష్టానుసారంగా మట్టి తవ్వితే కట్టమంచి చెరువుకు ప్రమాదం అని తెలిసినప్పటికీ అడ్డుకోలేదు. ప్రస్తుతం గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు నమోదు కావడంతో కట్టమంచి చెరువులో శుక్రవారం నుంచి మట్టితవ్వకాలు నిలిపివేశారు.





BEFORE THE NATIONAL GREEN TRIBUNAL (SZ) CHENNAI

MEMORANDUM OF APPLICATION

పక్కా ఆధారాలతో గ్రీన్ ట్రిబ్యునల్‌కు

జిల్లా కేంద్రంలోని గాండ్లపల్లి రెవెన్యూ పరిధి సర్వే నం .1లోని కట్టమంచి చెరువులో టీడీపీ నేతలు పూడికతీత పేరుతో మట్టి అక్రమ రవాణాకు పూనుకున్నారు. ఈ విషయం పై తిరుపతి జిల్లా, కేవీబీపురం మండలం, కళత్తూరు గ్రామానికి చెందిన కోలా విజయ్‌కిరణ్ అనే న్యాయవాది గ్రీన్ ట్రిబ్యునల్ చెన్నై బెంచ్‌లో పిటీషన్ వేశారు. కట్టమంచి చెరువులో మట్టిని తొలగించడం పర్యావరణ రక్షణ చట్టం 1986 సెక్షన్ 5ను ఉల్లంఘించడమేనని ఉద్ఘాటించారు. కట్టమంచి చెరువులో 2 కి.మీ చుట్టు కొలతతో అక్రమ తవ్వకాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ అక్రమ రవాణాపై పీజీఆర్‌ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్)లో పిటీషన్ వేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కట్టమంచి చెరువును కాపాడేందుకు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు నమోదయ్యింది. ఏపీ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్, సైన్స్, టెక్నాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, చిత్తూరు కలెక్టర్, చిత్తూరు నగరపాలక కమిషనర్, చిత్తూరు తహసీల్దార్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ కార్యదర్శిని ప్రతివాదులుగా నమోదు చేశారు.

వైఎస్ఆర్‌సీపీ జిల్లా కమిటీల ఎంపిక

తిరుపతి కల్చరల్: వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన వివిధ విభాగ కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈమేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్ఆర్‌టీయూసీ విభాగం కార్యదర్శిగా తిరుపతికి చెందిన షేక్ మహ్మద్ రఫీ నియమితులయ్యారు. జిల్లా యూత్ విభాగం సభ్యుడుగా నగరి అసెంబ్లీ నియోజకవర్గానికి పి.హరి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శిగా కె.మనోహర్‌రెడ్డి, జిల్లా ఆర్‌టీఐ విభాగం ప్రధాన కార్యదర్శిగా డి.రాజగోపాల్, జిల్లా ఆర్‌టీఐ విభాగం సభ్యుడుగా జి.కృష్ణమూర్తి , జిల్లా ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా బి.లక్ష్మీపతి, జిల్లా పంచాయతీరాజ్ విభాగం సభ్యుడుగా ఎస్.సెల్వరాజు, జిల్లా వైఎస్ఆర్‌టీ యూసీ సభ్యుడిగా పాండియన్, జిల్లా గ్రీవెన్స్ సెల్ సభ్యుడుగా భాస్కర్‌రెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శిగా నరపరాజు, జిల్లా మున్సిపల్ విభాగం సభ్యుడుగా రాజేంద్ర నియమితులయ్యారు.

వేతనాల పెంపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్, మజ్దూర్ వర్కర్ల జీతాలను పెంచినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఎన్ఎంఆర్, మజ్దూర్ వర్కర్లకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి కనీస వేతనాలు పెంచడం జరిగిందన్నారు. ఈ వేతనాల పెంపు ఏప్రిల్ 2025 నుంచి వర్తిస్తుందన్నారు. గ్రామీణ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న సిబ్బందిని స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కేటగిరీలుగా విభజించి వేతనాలను నిర్ణయించినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో అన్ స్కిల్డ్ వర్కర్లకు రూ.565, సెమీ స్కిల్డ్‌కు రూ.593, స్కిల్డ్‌కు రూ.624గా నిర్ణయించామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అన్ స్కిల్డ్ వర్కర్లకు రూ.652, సెమీ స్కిల్డ్‌కు రూ.685, స్కిల్డ్‌కు రూ.719, కార్పొరేషన్ పరిధిలో అన్‌స్కిల్డ్ వర్కర్లకు రూ.712, సెమీ స్కిల్డ్‌కు రూ.748, స్కిల్డ్‌కు రూ.786గా వేతనాలు నిర్ణయించినట్టు కలెక్టర్ వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 67,388 మంది తిరుమలేశుని దర్శించుకున్నారు. 21,998 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.1.74 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 16 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 3 గంటల్లో వెంకన్నను దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై అవగాహన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో జీఎస్టీ అమలు పై సమావేశం నిర్వహించారు. జీఎస్టీ 2.0 అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రం ప్రకటించిన వస్తు సేవల పన్ను తగ్గింపు జీఎస్టీ 2.0 ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అక్టోబర్ 19 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్, జిల్లా స్థాయిలో మాన్యుఫ్యాక్చర్‌లు, డీలర్ల చేత ఎగ్జిబిషన్‌లు, ద్విచక్ర వాహనాల ర్యాలీ, సెమినార్‌లు నిర్వహించాలన్నారు. సమావేశంలో వాణిజ్య పరిశ్రమల శాఖ జాయింట్ కమిషనర్ రఘునాథరెడ్డి, డిప్యూటీ కమిషనర్ పరదేశినాయుడు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం 7 గంటలకు జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం నుంచి మెసానికల్ మైదానం వరకు రన్ ఫర్ టూరిజం 2కేరన్ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాస, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు పర్యాటక, మున్సిపల్, పోలీస్, క్రీడా, విద్యాశాఖ అధికారులకు అప్పగించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

బాలకృష్ణ తాగి అసెంబ్లీకి వెళ్లాడేమో!



రేణిగుంట: ఎమ్మెల్యే బాలకృష్ణ మద్యం సేవించి అసెంబ్లీకి వెళ్లి మాట్లాడాడా..? అనే అనుమానం వస్తోందని మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. విజయవాడ నుంచి శుక్రవారం రాత్రి రేణిగుంటకు చేరుకున్న ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ప్రతి ఒక్కరికీ దేవాలయం లాంటిదని, అలాంటి ప్రదేశంలో బాలకృష్ణ మాట్లాడిన మాటలను ప్రతి ఒక్కరూ ఆలోచిస్తున్నారని తెలిపారు. మానవత్వం, కృతజ్ఞత అనేది బాలకృష్ణకు ఉంటే మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పై అలాంటి మాటలు మాట్లాడరన్నారు. కౌరవుల సభలో ద్రౌపదిని అవమానించి ఆనందించినట్లు అసెంబ్లీలో అభివృద్ధిని పక్కనపెట్టి జగన్ జపం చేస్తున్నారని అన్నారు. బాలకృష్ణ చేసిన పనికి రాజశేఖరరెడ్డి తలుచుకుని ఉంటే జీవితాంతం జైల్లో ఉండేవారన్నారు. మానవత్వం చూపిన కుటుంబంపై ఈ విధంగా మాట్లాడడం తగదన్నారు. జగన్మోహన్‌రెడ్డి కూడా బాలకృష్ణ అభిమానే అని.. అలాంటి వ్యక్తిపై వ్యక్తిత్వం చంపుకొని మాట్లాడడం బాధాకరమన్నారు. అయితే సినీ నటుడు చిరంజీవి హుందాతనంతో వెంటనే స్పందించారని అన్నారు. చిరంజీవి స్పందించకుండా ఉంటే ప్రజల్లోకి వేరే విధంగా వెళ్లి ఉండేదన్నారు. మెగాస్టార్ చిరంజీవి లాగానే పవన్ కళ్యాణ్ కూడా నడుచుకుంటే బాగుంటుందని హితవు పలికారు.

మెంటల్ సైకో.. నోరు అదుపులో పెట్టుకో

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మెగాస్టార్ చిరంజీవిపై టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగుతోంది. పేదల పక్షపాతిగా పేరుగడించిన జగన్‌మోహన్‌రెడ్డిపై నోరు పారేసుకోవడం ఏమిటని పలువురు విమర్శలు ఎక్కుపెడుతున్నారు. తనకు మెంటల్ ఉంది.. మానసిక రోగినే అంటూ డాక్టర్ల చేత సర్టిఫికెట్ పొందిన వ్యక్తి ఇలా సైకోలాగా చిరంజీవిపై నోరు పారేసుకోవడంపై తీవ్రంగా స్పందిస్తున్నారు. నోరు అదుపులో పెట్టుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

చిరంజీవిని అడిగితే సహించం



చిత్తూరు రూరల్ (కాణిపాకం): బాలకృష్ణ అసెంబ్లీలో చిరంజీవిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను శ్రీకృష్ణదేవరాయ బలిజ సంక్షేమ సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్టు శ్రీకృష్ణదేవరాయ బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహేశ్వరనాయుడు (అప్పాజీ) పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత చిరంజీవిని నోటికొచ్చినట్టు మాట్లాడడం సమంజసం కాదన్నారు. కరోనా, వరదల సమయంలో ఎంతో మందిని ఆదుకున్న వ్యక్తి చిరంజీవి అని గుర్తుచేశారు. చిరంజీవి జగన్‌ను కలిసినప్పుడు, ఆయన గౌరవ మర్యాదలతో చిరంజీవిని ఆహ్వానించి, ఆతిథ్యం ఇచ్చి సాగనంపారని గుర్తుచేశారు.

వైఎస్ జగన్‌కు క్షమాపణ చెప్పాలి



రొంపిచెర్ల: మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి బాలకృష్ణ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరనాథరెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ అసెంబ్లీలో జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. తన స్థాయి మరిచి బాలకృష్ణ వ్యవహరించడం భావ్యం కాదన్నారు. సభలో లేని సమయంలో అలా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. గతంలో తుపాకీతో ఇంట్లో కాల్పులు జరిపితే నిన్ను కాపాడింది ఎవరో తెలుసుకోవాలన్నారు. 2014–2019 వరకు బసక తారకం ఆస్పత్రికి ఆరోగ్యశ్రీ బిల్లులు నిలిచిపోతే బిల్లులు మంజూరు చేసిన ఘనత జగనన్నదేనన్నారు. అఖండ మూవీకి ప్రత్యేక షోలను అనుమతి ఇచ్చిన జగన్‌ను ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తు ఊరుకోమన్నారు.

బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి



కార్వేటినగరం: మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కూటమి ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీ సాక్షిగా క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన జగనన్నపై నంద మూరి బాలకృష్ణ విమర్శలు గుప్పించడం మంచిది కాదన్నారు. టీడీపీని నందమూరి తారకరామారావు స్థాపిస్తే ఆయన తనయుడిగా ముఖ్యమంత్రి హోదాలో ఉండాల్సిన బాలకృష్ణ ఎమ్మెల్యే కొనసాగడం బాధాకరమన్నారు. అలాంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా తనదైన శైలిలో రాష్ట్ర ప్రజలకు విద్య, వైద్యం, సంక్షేమా లు అందించిన జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రిని విమర్శించే అర్హత లేదన్నారు. అధికారాలు ఒకేలా ఉండబోవన్నారు.

అత్యంత దుర్మార్గం



వి.కోట : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కూటమి ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసు లు ధ్వజమెత్తారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడే అర్హత బాలకృష్ణకు లేదన్నారు. బాలకృష్ణ మెంటల్ సర్టిఫికెట్‌తో బయట తిరుగుతున్నాడని, సభలో లేని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అమర్యాదగా మాట్లాడడం బాధాకరమన్నారు. బాలకృష్ణ సైకో కాబట్టి ఆనాడు ఇంటికి వచ్చిన స్నేహితుడుని తుపాకీతో కాల్చాడని మండిపడ్డారు. నోటికొచ్చినట్టు మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

ఆ గౌరవం కూడా పోయింది



పలమనేరు: అసెంబ్లీలో బాలకృష్ణ వ్యవహారశైలి, మాట్లాడిన తీరును చూసి వారి తండ్రి ఎన్టీరామారావుపై ప్రజల్లో ఉన్న గౌరవం కూడా పోయిందని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. బాలకృష్ణ సినిమాల కోసం గత ప్రభుత్వంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నుంచి లబ్ధిపొందినప్పుడు ఆయన మంచివారు.. ఇప్పుడు చెడ్డవారా..? అని ప్రశ్నించారు. బాలకృష్ణ వ్యాఖ్యలు ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. సభలో సంబంధంలేని చిరంజీవిపై తూలనాడడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. ఇంత జరిగినా జనసేన మంత్రులు, ఎమ్మెల్యేలు అసలు మాట్లాడకపోవడం మరీ ఘోరమన్నారు. దీన్నిబట్టి చూస్తుంటే ఎన్నటికీ టీడీపీకి జనసేన కట్టుబానిసగా ఉండాల్సిందేనని తెలుస్తోందన్నారు. బాలకృష్ణ అదే అసెంబ్లీలో జగనన్నకు సారీ చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు.

వారానికి ఒకసారి ఆరోగ్య తనిఖీలు



మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాల్లో ఉండే పిల్లలకు వారానికి ఒకసారి ఆరోగ్య తనిఖీలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి బాలల సంరక్షణ కేంద్రాల తనిఖీ, వివిధ అంశాలపై కమిటీ మెంబర్‌లతో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 9 బాలల సంరక్షణ సంస్థలున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాలను కమిటీ మెంబర్లు కచ్చితంగా సందర్శించాలన్నారు. ప్రతి కమిటీలో ఒక మహిళ, వైద్యుడు మొత్తం ముగ్గురు సభ్యులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పిల్లల ఆరోగ్య సమస్యలను డాక్టర్ల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చికిత్సలు చేయించాలన్నారు. నిబంధనలు అమలు చేయని కేంద్రాలపై కఠిన చర్యలుంటాయని జేసీ హెచ్చరించారు. జిల్లా మిషన్‌వాత్సల్య కో–ఆర్డినేటర్ నిర్మల, జిల్లా సంరక్షణ అధికారిణి రాధ, జిల్లా బాలల సంరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్లుప్తంగా

మా భూమిని ఆక్రమిస్తున్నారయ్యా!



మాట్లాడుతున్న బాధితులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తమ అనుభవంలోని రెండెకరాల భూమిని టీడీపీ యాదమరి మండల అధ్యక్షుడు మురార్జీ, కార్యకర్త కుప్పయ్యమందడి ఆక్రమిస్తున్నారని అదే మండలం, రసూల్ నగర్ ఏఏడబ్ల్యూ కాలనీకి చెందిన బుజ్జి ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. యాదమరి తహసీల్దార్ అండతో అక్రమార్కులు తప్పుడు రికార్డులు సృష్టించి తమను వేధిస్తున్నారని ఆవేదన చెందారు. తమ భూమిలోని టేకు, మామిడి చెట్లను తొలగించారని.. ప్రశ్నించిన తమను కులం పేరుతో దూషించారని కన్నీటిపర్యంతమయ్యారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే తమపై తప్పుడు కేసు పెడుతామని అధికారులు, టీడీపీ నేతలు బెదిరిస్తున్నారని చెప్పారు. తమ బతుకులు రోడ్డు పాలు చేస్తున్న మురార్జీ పై చర్యలు తీసుకోవాలని కోరారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి



మృతి చెందిన వేలు

గుడుపల్లె: వ్యవసాయ పొలం వద్ద కరెంట్ షాక్‌కు గురై వేలు (40) అనే వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. బంధువుల కథనం.. మండలంలోని కంచిబందార్లపల్లె గ్రామానికి చెందిన వేలు తన పొలం వద్ద ఇల్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ బావి వద్ద ఉన్న స్టార్టర్‌లోని స్విచ్ వేసేందుకు వెళ్తుండగా కరెంట్ వైరు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్థానికులు అతన్ని కుప్పం ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందాడు.

గ్రానైట్ వ్యాపారి ఆత్మహత్యాయత్నం



శేఖర్‌నాయుడు

చిత్తూరు అర్బన్: జిల్లా గ్రానైట్ ఫ్యాక్టరీల సంఘం నాయకుడు, చిత్తూరుకు చెందిన ప్రముఖ గ్రానైట్ వ్యాపారి శేఖర్ నాయుడు శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చిత్తూరులోని మిట్టూరుకు చెందిన శేఖర్‌నాయుడుకు పలు క్వారీలు, గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నా యి. దీంతోపాటు కొన్ని క్వారీలను లీజుకు తీసుకొని నడిపిస్తున్నాడు. శుక్రవారం రాత్రి చిత్తూరు మండలంలోని సిద్ధంపల్లె వద్ద కు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అప్పటికి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న శేఖర్నాయుడు తనతో తెచ్చుకున్న పురుగుల మందు తాగి పడిపోయాడు. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వేలూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గరుడసేవ నాడు ద్విచక్ర వాహనాల రాకపోకలు రద్దు

తిరుమల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా సెప్టెంబరు 28న గరుడ సేవ నాడు విశేషంగా భక్తులు తిరుమలకు చేరుకుంటారు. ఘాట్ రోడ్లలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సెప్టెంబరు 27న సాయంత్రం 6 గంటల నుంచి సెప్టెంబరు 28 ఉదయం 6 గంటల వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలను టీటీడీ రద్దు చేసినట్లు తెలిపింది. తిరుపతిలోని అలిపిరి పాత చెక్ పాయింట్ వద్ద ద్విచక్ర వాహనాలను పార్క్ చేసుకునే సదుపాయాన్ని టీటీడీ కల్పిస్తోంది.



దౌర్జన్యాల టెండర్!

తిరుపతి నగర పాలక సంస్థలో పనులకు సంబంధించిన టెండర్లు దౌర్జన్యాలతో కూటమి నేతలే వశం చేసుకుంటున్నారు. అలా కాదని వేరొకరు టెండర్లు వేసి దక్కించుకుంటే మాత్రం ఆ కాంట్రాక్టర్‌పై దాడులకు తెగబడుతున్నారు. తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో అధికారి ముందే జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనపై బాధితులు ఎవ్వరికీ ఫిర్యాదు చేయకుండా కూటమి నేతలు, అధికారులు భయపెట్టి నోరు మూయించినట్లు సమాచారం.

కార్పొరేషన్‌లో కూటమి రౌడీయిజం

- అభివృద్ధి పనుల టెండర్లన్నీ కూటమి శ్రేణులకే
- అర్హత లేకపోయినా నేతలు చెప్పిన వారికే టెండర్
- వేరొకరు వేసినా వారిని బెదిరించి ఉప సంహరింపజేస్తున్న నేతలు
- ఫిర్యాదు చేయకుండా కాంట్రాక్టర్లతో లేఖ రాయించుకుంటున్న వైనం
- కోర్టు ద్వారా టెండర్ దక్కించుకున్నందుకు ఓ కాంట్రాక్టర్‌ని చితకబాదిన కూటమి నేతలు
- తిరుపతి కార్పొరేషన్‌లో పనులకు టెండర్ వేయాలంటే భయపడుతున్న కాంట్రాక్టర్లు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : తిరుపతి నగర పరిధిలోని కొరమేనుగుంటలో మురుగు కాలువ నిర్మాణ పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. అందరితో పాటు ఓ కాంట్రాక్టర్ కూడా టెండరు వేశాడు. టెండర్ ఓపెన్ చేస్తే ఆ వ్యక్తికే దక్కుతుందని కూటమికి చెందిన నాయకుడు తెరవకుండా ఆలస్యం చేయించారు. విషయం తెలుసుకున్న ఆ కాంట్రాక్టర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఫలితంగా టెండర్ ఓపెన్ చేయక తప్పలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు టెండర్ ఆ కాంట్రాక్టర్‌కే దక్కింది. పనులు మొదలు పెట్టారు. తమను కాదని టెండర్ దక్కించుకోవటాన్ని జీర్ణించుకోలేని కూటమి నాయకుడు మురుగు కాలువ నిర్మాణ పనులకు కూలీలను ఎవ్వరినీ వెళ్లకుండా అడ్డుకున్నారు. పనులు కూడా కొద్ది రోజులుగా ఆగిపోయాయి.

బెదిరించి భయపెట్టి..

తిరుపతి నగర పాలక సంస్థలో టెండర్లు దక్కించుకోవాలంటే కూటమి శ్రేణులై ఉండాలి. అర్హత ఉన్నా లేకపోయినా వారికే దక్కుతాయి. కూటమి శ్రేణులకు కాకుండా ఎవరు టెండర్ దక్కించుకున్నా బెదిరించి, భయపెడుతారు. అనారోగ్య కారణాలతో టెండర్‌ను ఉప సంహరించుకుంటున్నట్లు లేఖలు రాయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలో ఇటీవల సుమారు రూ.15.11 కోట్ల పనులకు సంబంధించి టెండర్లు ఆహ్వానించారు. ఈనెల 3వ తేదీలోపు టెండర్లు దాఖలు చేయాలని ప్రకటించారు. అందులో భాగంగా అనేక మంది ఆన్‌లైన్ ద్వారా టెండర్‌లు దాఖలు చేశారు. అర్హత లేని వారు కూడా టెండర్లు దాఖలు చేశారు. నిబంధనల గురించి తెలిసిన కాంట్రాక్టర్లు కొందరు ఎక్కువ చేస్తే, మరి కొందరు తక్కువకు కోట్ చేశారు. టెండర్లు ఎవరికి దక్కుతాయో తెలుసుకున్న కూటమి నేతలు ఆయా కాంట్రాక్టర్ల వద్దకు వెళ్లడం, మరి కొందరిని కార్పొరేషన కార్యాలయానికి పిలిపించినట్లు తెలిసింది. కూటమి శ్రేణుల కోసం చెప్పిన తేదీకి టెండర్ ఓపెన్ చేయకుండా పెండింగ్ పెట్టించిన దాఖలాలు కూడా ఉన్నాయి. కాంట్రాక్టర్లను నయానో, భయానో బెదిరించినట్లు కార్పొరేషన్‌లోని అధికారి ఒకరు వెల్లడించారు. కూటమి శ్రేణుల బెదిరింపులకు భయపడి అనేక మంది కాంట్రాక్టర్లు టెండర్లను ఉప సంహరించుకుంటున్నట్లు తెలిసింది. ఉప సంహరించుకున్న కాంట్రాక్టర్ రకరకాల కారణాల చేత తప్పుకుంటున్నట్లు లెటర్ రాయించుకున్నట్లు తెలిసింది. అలా లేఖ రాసివ్వకపోతే వారిపై దాడులు చేయడం . అయినా టెండర్ దక్కించుకుని పనులు మొదలు పెడితే కార్మికులను రాకుండా అడ్డుకోవడం వంటి దౌర్జన్యాలకు తెరతీసినట్లు తిరుపతి నగరంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

కూటమి నేతలు ఎవరు చెబితే వారికే..

టెండర్ల విషయంలో కూటమి శ్రేణులు ఎలా చెబితే అధికారులు అలా తలూపటం చేస్తున్నారని కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య పనులకు సంబంధించి మెటీరియల్ కొనుగోలు టెండర్ దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్‌ను కూటమి నేతలు తీవ్ర ఇబ్బందులు పెట్టినట్లు సమాచారం. ఆ టెండర్‌ను టీడీపీ నేత తన అనుచరుడికి ఇప్పించాలని పట్టుబట్టారు. అందులో భాగంగా ఆ కాంట్రాక్టర్‌ను సంప్రదించారు. ఆ కాంట్రాక్టర్ కాస్త బలవంతుడు కావడంతో ససేమిరా అన్నాడు. టెండర్ మొత్తం ఒక్కరికే కాకుండా రెండుగా విడగొట్టేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న ఆ కాంట్రాక్టర్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న అధికార పార్టీ నాయకుడు టెండర్ ఓపెన్ చేయకుండా గడువు పొడిగించారు. కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడంతో ఆ కాంట్రాక్టర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించి టెండర్ దక్కించుకున్నట్లు సమాచారం.

అధికారుల ముందే దాడి

పనులకు రాకుండా అడ్డుకున్న విషయంపై ఆ కాంట్రాక్టర్ తిరుపతి కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని సంబంధిత అధికారికి ఫిర్యాదు చేశారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న కూటమి శ్రేణులు అధికారుల ముందే ఆ కాంట్రాక్టర్‌పై దాడి చేశారు. ఉన్నతాధికారి ముందే దాడి జరిగినా ఎవ్వరూ ఆపే ప్రయత్నం చేయలేదు. మూడు నాలుగు రోజుల తరువాత బాధితుడు వేసిన టెండర్‌కు అర్హత లేదని తిరస్కరించి టీడీపీ కాంట్రాక్టర్‌కే కట్టబెట్టినట్లు కార్పొరేషన్ కార్యాలయంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దాడి చేసినట్లు, బెదిరించినట్లు ఎవరికైనా ఫిర్యాదు చేస్తే అంతు చూస్తామని తీవ్ర స్థాయిలో బెదిరించినట్లు విశ్వసనీయ సమాచారం.

చిత్తూరు కార్పొరేషన్‌లోనూ..

చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలోనూ వివిధ పనులకు సంబంధించి టెండర్లు ఆహ్వానించారు. అన్ని పనులకు కూటమి పార్టీలకు చెందిన వారే టెండర్లు వేయించేలా చర్యలు తీసుకున్నారు. ఒక పనికి టీడీపీ, బీజేపీ, జనసేన సానుభూతి పరులు టెండర్లు వేస్తారు. ముగ్గురు ఒక్కటై పనులను పంచుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. కూటమి పార్టీలకు చెందిన వారు కాకుండా వేరొకరు టెండరు దాఖలు చేస్తే వారిని బెదిరించి ఉప సంహరించుకుంటున్నట్లు లేఖలు రాయించుకుంటుండడం ఆందోళన కలిగిస్తోంది.

క్రీడలతో ఉజ్వల భవిత



జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఓటమి పొందిన సమయంలో కుంగిపోకుండా తిరిగి పోటీల్లో రాణించేలా ప్రయత్నం చేయాలన్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు చందు మాట్లాడుతూ క్రీడల్లో మంచి పుణ్యం ప్రదర్శిస్తే క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడవచ్చన్నారు. జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో ఎంపికైన జట్లకు అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో విశాఖపట్టణం జిల్లా నర్సీపట్టణంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన జట్లను అభినందించారు. అనంతరం ఉచితంగా క్రీడాదుస్తులు అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్‌లు దేవానంద్, నూరుద్దీన్, కృష్ణా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐఐటీ ఫేజ్–బీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ప్రధాన ప్రవేశ ద్వారం

ఏర్పేడు : తిరుపతి ఐఐటీ శాశ్వత క్యాంపస్ అభివృద్ధి పనుల్లో భాగంగా ఫేజ్–బీ పనులకు శనివారం భారత ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో భూమి పూజ చేయనున్నట్లు ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఐఐటీ అభివృద్ధికి ఫేజ్–బీ కింద రూ.2,313 కోట్లు నిధులు కేటాయించింది. ఫేజ్–ఏలో ఇప్పటికే రూ.1,444 కోట్లు ఖర్చు చేయగా, ఫేజ్–బీ నిధులతో మరింతగా ఐఐటీ శాశ్వత ప్రాంగణం అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తితో పాటు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరు కానున్నారు.

నేషనల్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ



లాంగ్‌జంప్‌లో విజేత

పలమనేరు: పట్టణంలోని కేవీఎస్ వీధికి చెందిన గౌతమి ప్రసాద్‌రెడ్డి కుమార్తె మోక్షితారెడ్డి నేషనల్ అథ్లెటిక్స్‌లో విశేష ప్రతిభ కనబరించింది. ఈనెల 24న గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన 36వ సౌత్‌జోన్ జూనియర్ నేషనల్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్పు 2025లో అండర్–16 విభాగం లాంగ్ జంప్‌లో విజేతగా నిలచింది. నిర్వాహకుల చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకుంది. బాలిక ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుకుంటూ హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. గతేడాది జరిగిన ఇదే క్రీడల్లో బాలిక గోల్డ్‌మెడల్ సాధించిన విషయం తెల్సిందే.

మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి అభివృద్ధి చెందేందుకు చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో జిల్లా సమాఖ్య ప్రతినిధులకు జెండర్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. పీడీ మాట్లాడుతూ హింస లేని కుటుంబాలే లక్ష్యంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది కృషి చేయాలన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మహిళల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అయితే సంఘాల్లో ఉన్న మహిళలకు ఆర్థిక వనరులు అందుకుంటున్న కుటుంబాల్లో హింస కారణంగా వనరులను సక్రమంగా సద్వినియోగం చేసుకోలేకపోతున్నారన్నారు. సమావేశంలో వయోజన విద్యాశాఖ డీడీ మహమ్మద్ ఆజాద్, డీపీఎం మంజుల, ఏపీఎంలు మధు, సుబ్బారెడ్డి, హేమ పాల్గొన్నారు.

బంగారుపాళెంలో అగ్ని ప్రమాదం



ఇంట్లో నుంచి వస్తున్న పొగ



ఇంట్లో కాలిపోయిన వస్తువులు

బంగారుపాళెం: మండల కేంద్రమైన బంగారుపాళెంలో శుక్రవారం సాయంత్రం ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సుమారు రూ.5 లక్షల విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. మండలంలోని మొగిలి వెంకటగిరి గ్రామానికి చెందిన నాగరాజ బంగారుపాళెంలో వినాయక టెక్స్‌టైల్స్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. పాత తాలూకా వీధిలో సొంత గృహాన్ని నిర్మించుకుని నివాసముంటున్నాడు. ఇంటికి తాళం వేసి దుకాణానికి వెళ్లాడు. సాయంత్రం ఇంట్లో నుంచి పొగలు రావడాన్ని చుట్టుపక్కల వారు గుర్తించారు. స్థానికులు పోలీసులకు, విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఇంటి తలుపులు, కిటికీలు పగులగొట్టి మంటలను అదుపుచేశారు. అగ్నిమాపక సిబ్బంది బంగారుపాళ్యానికి చేరుకుని మంటలను పూర్తి స్థాయిలో ఆర్పివేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

భూకబ్జాలో రవితేజం!

కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతల కన్ను ప్రభుత్వ, పేదల భూములపై పడుతోంది. అధికారం అడ్డుపెట్టుకుని ఏకంగా పేదల ఇళ్ల స్థలాలతోపాటు అటవీశాఖ భూమిని సైతం దర్జాగా కబ్జా చేశాడు. కార్పొరేట్ స్థాయిలో కొబ్బరి తోట సాగుకు పూనుకున్నాడు. దాదాపు కోటి రూపాయల విలువైన 8 ఎకరాలను ఆక్రమించాడు. ఈ యవ్వారంపై శుక్రవారం బాధితులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన చేయడంతో అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. భూమి ని చదును చేస్తున్న జేసీబీని సీజ్ చేశారు.

- పేదల ఇళ్ల స్థలాలతోపాటు అటవీశాఖ భూమి ఆక్రమణ
- జేసీబీతో చదును.. కొబ్బరి చెట్లు నాటిన వైనం!
- వైఎస్సార్‌సీపీ శ్రేణులు, స్థానికుల ఆందోళన
- జేసీబీని సీజ్ చేసిన అటవీశాఖ అధికారులు



బండపల్లెలో ఆక్రమణకు గురైన భూమి వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, పేదలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఇళ్లు లేని నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తమ పాలనలో బండపల్లె ప్రాంతంలో సుమారు 30 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించింది. ఎకరాకు రూ.6 లక్షల చొప్పున పరిహారం చెల్లించింది. సుమారుగా 500 మందికి ఇళ్ల స్థలాలను కేటాయించింది. నీటి వసతి, కరెంటు సౌకర్యం కల్పించింది. అయితే ఆర్థిక స్థోమత లేకపోవడం, ఇతర కారణాలతో కొంత మంది ఇళ్లు కట్టుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఓ కార్పొరేటర భర్త ఆ స్థలంపై కన్నేశారు. ఎలాగైనా దానిని సొంత చేసుకోవాలని కరెంటు స్తంభాలు, నంబర్ రాళ్లను, నీటి పైపులను ధ్వంసం చేశాడు. పేదల ఇళ్ల స్థలాలతో పాటు అటవీ భూములను సైతం ఆక్రమించేశాడు. ఆక్రమించిన సుమారు 8 ఎకరాల స్థలంలో దాదాపు 400 కొబ్బరి చెట్లు నాటాడు. ఇది ఆ నోటా ఈనోటా పడి చివరకు అధికారుల చెవిలో పడింది. గురువారం రెవెన్యూ అధికారులు ఆ భూమిని పరిశీలించి ఆక్రమణకు గురైనట్లు గుర్తించి కొబ్బరి చెట్లను తొలగించారు.

పేదల స్థలాన్ని కబ్జా చేస్తారా..?

రెవెన్యూ అధికారులు కబ్జాకు చెక్ పెట్టినా మళ్లీ ఆక్రమణ పర్వం కొనసాగడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, పేదలు శుక్రవారం ఆక్రమిత ప్రాంతంలో ఆందోళనకు దిగారు. ఆక్రమణ వ్యవహారాన్ని మీడియా ముందుకు పెట్టి, నాయకులు అంజలిరెడ్డి, హరీషారెడ్డి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నేతలు దోచుకోవడమే పనిగా పడ్డారన్నారు. టీడీపీ కార్పొరేటర్ జయలక్ష్మి భర్త పేదల ఇళ్ల స్థలాలతోపాటు అటవీశాఖ భూములను సైతం కబ్జాచేశారని, కరెంటు స్తంభాలు, పైపులైన్లను దౌర్జన్యంగానే తొలగించారని మండిపడ్డారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు జేసీబీని సీజ్ చేశారన్నారు. జయలక్ష్మి భర్త లెప్రసీ డాక్టర్‌గా పనిచేస్తూ రెండు నెలల క్రితమే ఉద్యోగ విరమణ చెందారని, వారికి కోట్లాది రూపాయల ఆస్తులు సైతం ఉన్నాయన్నారు. అధికారులు తనకు 8 ఎకరాల స్థలం కేటాయించినట్లు ఆయన చెప్పుకుంటున్నారని, ఇదే నిజమైతే ఎవరికి ఎంతెంత వాటాలందాయో, దీని వెనుక బాగోతమేమిటో ఉన్నతాధికారులే తేల్చాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఇక్కడ బాధితులకు ఎమ్మెల్యే సైతం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని లేనిపక్షంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్, మురగయ్య, ప్రభాకర్‌రెడ్డి, వెంకటముని, సుధా, బాలాజీ, సురేంద్ర, రమేష్, మోహన్, మురగ, సెల్వం, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. దీనిపై రూరల్ తహసీల్దార్ జయప్రకాష్‌ను వివరణ కోరగా.. ఆక్రమణలను తొలగించినట్లు చెప్పారు.



ధ్వంసమైన తాగునీటి ట్యాంక్, పైపులు



విద్యుత్ స్తంభాలు



చదును చేసిన భూమి